# సత్తెమ్మ పరిగె స్వరాజ్యరెడ్డిగారు

**స్వరాజ్యరెడ్డిగారు ఏం మాటాడినా తక్కిటులో నికార్సయిన రాళ్ళేసి తూచినట్టుంది. ఆయన ఏం చెప్పినా నిజంలాగే వుండేది. గుడ్డిపట్టాభి కొట్టు దగ్గర కూర్చుని రోజూ ఎన్నో నిజాలు చెప్పేవాడు.**

**కుప్పలు తెప్పలుగా డబ్బు వస్తే ఎదురయ్యే ఇబ్బందులు గురించి మొదలెట్టేడు**

ఆరోజు

ఉట్టప్పుడు ఏ జనం సంచారం లేకుండా పడుండే పెదరెడ్డిగారి గరువు మధ్యలో ఉంది సత్తెమ్మగుడి. సంక్రాంతి రోజులప్పుడు చూడాలి ఆగుడి వైభోగం. కనుమ పండగనించి వరసగా అయిదురోజుల పాటు కళకళ్ళాడి పోతూ ఉంటది ఆ దిబ్బ. రాత్రీ పగలనక ఒకటే జనం. గుండాటలూ, చక్రం ఆటలూ ఉంటాయిగానీ అసలుసిసలు జూదమాటలేటంటే కోడిపందాలు. చుట్టుపక్కల రెండు మూడు జిల్లాల్లో పేరెల్లిన కోడిపందాలు. ఒకేసారి పదిహేనుచోట్ల జరుగుతాయి. బాగా మేపిన పందెం కోళ్ళతో ఎక్కడెక్కడినించో దిగిపోతుంటారు జనం.

వందలూ వేలనించి లక్షల్లో కాస్తుంటారు పందాలు. డబ్బే కాదు ఇళ్ళు, పొలాలు, తోటల్తో కూడా ఆడ్తుంటారు జూదం. నిరుడయితే అనకాపిల్లి అవతలున్న కృష్ణ జగన్నాథపురం నించొచ్చిన వీరినాయుడు పదెకరాల జీడిమామిడితోటనీ, అయిదెకరాల మావిడితోటనీ కోడి పందెంలో ఓడిపోయాడు. వూలపిల్లి నించి వచ్చిన మోటాటిరెడ్ల కుర్రోడయితే కొంకుదురు వంతెన కిందున్న తన పదెకరాల పంట భూమినీ పోగొట్టుకున్నాడు. విజయనగరం అవతల నెల్లిమర్లనించి వచ్చిన ఒకరాజుగారు పదిహేను లక్షలు పందెంలో సంపాయించి ఆ తర్వాత అయిదు లక్షలు పోగొట్టుకుని వెళ్ళేడు.

సంక్రాంతి నెల పట్టేరు.

సత్తెమ్మగుడి బూజులు దులిపి ఎల్ల వేస్తున్నారు.


చెట్లూ పుట్టలూ నరికేసి చదును చేస్తున్నారా గరువుని.

ఊళ్ళో పందెం కోళ్ళకి కత్తులు గట్టే సూరిబాబు రకరకాల మేలురకం కత్తులు తయారుచెయ్యడంలో హడావుడిగా ఉన్నాడు.

ప్రతీ ఏడూ ఎన్నో ప్రాణాల్ని తీసి ఎంతో రక్తం తాగే పెదరెడ్డిగారి గరువు ఆవురావురు మంటా ఈ ఏడు ఎన్ని ప్రాణాలు తీయిద్దామా ఎంత రక్తం తాగుదామా అని చూస్తుంది.

* * *


సారా సూరమ్మ మేనల్లుడు క్రిష్ణంటే ఆ ప్రాంతంలో చాలా మందికి భయం. ఆ మధ్య ఒక గొడవ జరిగినప్పట్నుంచీ మరీ పెచ్చుమీరి



పోతున్నాడు క్రిష్ణ. హద్దూ ఆపూ లేకండా పోతున్నాయి వాడికి.


వెంటూరులో వూర్ని బంగారుబాబుకీ వేళంగిలో గొడితి రంగారాయుడుకీ చాలా ఏళ్ళనించి గొడవలు. క్రిష్ణని పిల్చిన బంగారుబాబు "నీకెంత గావాలంటే అంతిస్తానుగానీ ఒరేయ్...ఆడి అంతు జూడాలి. బతికుండగానే నా కళ్ళ ముందు నరకం చూడాలి ఆడు ఏం చేస్తావో చెయ్యి" అన్నాడు.

ద్రాక్షారం సంతకెళ్ళొస్తున్న రంగారాయుడు తాళ్ళపాలం దగ్గర మోటారు సైకిలాపి ఉచ్చపోసుకుంటుంటే వెనక నించొచ్చిన క్రిష్ణ



చెరుకుతోటలోకి లాక్కెళ్ళి నోట్లో గుడ్డలు కుక్కేసి ఉన్న పళాన కాలూ చెయ్యీ నరికేసేడు. అంతే.

ఆగొడవ పోలీసులు దాకా వెళ్ళకండానే సద్దు మణిగిపోయింది. ఇక అక్కడ్నుంచి ఎక్కడ ఏ గొడవ జరిగినా క్రిష్ణ వస్తున్నాడంటే బెదిరిపోతున్నారు. చాలా మంది కుర్రోళ్ళు క్రిష్ణదగ్గర జేరిపోడంతో చాలా పేరెల్లిపోయేడు క్రిష్ణ.



* * *

అవతలొడ్డునున్న కోటిపిల్లి వెళ్ళాల్సిన వాళ్ళు ముక్తేశ్వరం రేవులో ఆగున్న ఆ నావలో ఎక్కుతున్నారు. కొబ్బరినౌజు సీనారేకు పళ్ళెంలో పెట్టుకుని అమ్మే చిన్నపిల్ల కేకల్తోనూ, పెసర పొణుకుల జంగిడీ పట్టుకు కల తిరుగుతున్న సొట్టకాలు శెట్టీ అరుపుల్తోనూ ఒకటే సందడిగా వుంది రేవు. జనంతో పాటు బట్టలమూటల సైకిళ్ళూ, పనసకాయల గుట్టలూ,



కూరగాయల బుట్టల వాళ్ళంతా ఎక్కేస్తున్నారు నావలోకి. గోలగోలకిందుంది.


రేపు ద్వారపూడిలో జరిగే సంతకి బయల్దేరుతున్న బండార్లంక షావుకారు చోటులేక అదే నావలో ప్రయాణం చేస్తున్న భోగమోళ్ళ పిల్ల చినబంగారం పక్కన కూర్చున్నాడు.

కాస్సేపటికి- నావ బయల్దేరింది.

బండార్లంక షావుకారు చెయ్యి మొసం చినబంగారం నడుం మడత దగ్గర గుచ్చుకుంది.

కంగారు పడ్డ షావుకారు "ఏవనుకోకమ్మా చూస్తున్నావు గదా తొడతొక్కిడి" అన్నాడు.

నలుపురంగు నైలెక్స్ చీర కట్టుకుని, దోసగింజబొట్టు పెట్టుకుని పక్క పాపిడి తీసుకుని పొట్టి జడేసుకుని సిగపాయలో మొగలిరేకు పెట్టుకున్న చినబంగారం మెత్తగా నవ్వింది.



ఆ నవ్వుకి అదోలాగయిపోయేడు షావుకారు.

చోటున్నా అక్కడేదో ఇరుకయిపోయినట్టు ఇంకాస్త దగ్గరగా జరిగింది చినబంగారం. వళ్ళీ షావుకారు మోచేత్తో పొడిపించుకుంది. దానికా బండార్లంక షావుకారు మండుతున్న చింతనిప్పుల మీదేసినమైనం ముద్ద లాగ కరిగిపోయేడు.

మధ్య మధ్యలో తిప్పలు తగిలి ఇబ్బంది పెట్టడం వల్ల నావ అద్దరికి జేరేటప్పటికి కొంచెం పొద్దోయింది.




చినబంగారం, బండార్లంక షావుకారూ మీంచెళ్ళే కోటిపిల్లి నించి రాజమండ్రి వెళ్ళే బస్సెక్కేరు.

ఏమందు పెట్టిందో ఏమంత్ర మేసి మాయజేసిందో ఆ చినబంగారం. బస్సు మా పసలపూడి కాలవగట్టు దగ్గర ఆగేక దిగుతున్న చినబంగారం వెనక ద్వారపూడి వంతెన దగ్గర దిగాల్సిన బండార్లంక షావుకారు బిస్కెట్లు పెట్టి మచ్చిక జేసుకున్న సీమకుక్కలాగా చినబంగారం వెనకాల దిగిపోయేడు.

అంత తెలివైన అంత లౌక్యం తెల్సిన చినబంగారం కూడా కనుమపండగ రోజునుంచీ తర్వాత అయిదురోజులు ఎక్కడికీ వెళ్ళకండా పెదరెడ్డిగారి గరువు దగ్గరే వుండాలని ఒట్టేసుకుంది.

* * *



దొంగరావుడు దొంగతనాలు చెయ్యడంలో ఆరితేరినవాడు. మన మధ్యనే తిరుగుతా దొంగతనాలు చేస్తుంటాడు కానీ ఎవరికీ దొరకడు. ఒకసారి-

కరణాల దొడ్లో ఏభైగెలల కొబ్బరికాయలు దొంగతనం చేసి, గోనె సంచుల్లో మూటలు కట్టి ద్వారంపూడిబసివిరెడ్డిగారికి అమ్మేశాడు. వాటిని ఆయనింటెనకాల గాదుల వెనక దాచాడు సుబ్బారెడ్డి. ఆ రాత్రి వాళ్ళ గాదుల దగ్గరకెళ్ళి దొంగిలించి బ్రాహ్మల సుబ్బారాయుడుగారి ముండ తలుపులమ్మకి అమ్మేసేడు. వాటిని కోమటి పెద వెంకట్రాజుకి అమ్మేలోపే మళ్ళీ దొంగతనం చేసి ఏం తెలీనట్టు కరణాల దొడ్లో దొంగతనం చేసేడో ఆ కరణాలకి అమ్మేసాడు కాయలు. ఇంతమంది చేతులు మారినా కాని వాడు మాత్రం ఎవరిచేతికి చిక్కలేదు.

ఆ ఏడాది దొంగరావుడి కన్నుకూడా పెదరెడ్డిగారి గరువు మీదే వుంది.

* * *

జమ్మిచెట్టు దగ్గరుండే కమ్మెట సూర్నాణ తోడల్లుడు ఆదిబాబుది పాయకరావు పేట. దేశంలో ఎక్కడ కోడి పందాలు జరిగినా డబ్బు కట్టలు గ్లాస్కో లాల్చీ జేబుల్లో కూరుకుపోయి వెళ్ళిపోయే ఆదిబాబు ఈ ఏడు పెదరెడ్డిగారి దిబ్బమీద వాలిపోయేడు.

* * *

పెద్ద పండుగెళ్ళి కనుమపండగొచ్చింది.

గరువు మీద జనం.

నేల తల్లి ఈనినట్టు ఒకటే జనం.

ఎక్కడినించో దిగిపోయిన జనం.

కాఫీ హోటేలూ కిళ్ళీకొట్లపాకల్లో జనం.

రద్దీ అంటే రద్దీ.

పందాలు మొదలయ్యినియ్యి. ఆడ్డానికొచ్చిన జనం చూడ్డానికొచ్చిన జనం చుట్టూ మూగిపోతున్నారు.

సోగ్గాడు ఆదిబాబుకి కాసింది కాసినట్టే పోతుంది. దురదృష్టం అతన్ని అంటుకునే ఉన్నట్టు ఆవేళ పొద్దోయేసరికి ఏభైవేలు పై చిలుకు పోయింది. మర్నాడు దీపాలవేళకి మరో యాభైపోయింది.

ఆదిబాబు నీరసించుకు పోయేడు కళ్ళు జేవురించుకుపోయినియ్యి.

ఆదిబాబునే చూస్తున్న జనం ''పాపం ఎంత పోయిందో'' అనుకుంటున్నారు.

ఆ వేళ ఆఖరిరోజు.

కాఫీహోటేళ్ళూ, కిళ్ళీకొట్లోళ్ళూ సామాన్లు తీసి సర్దేసుకుంటున్నారు. మూటలు గట్టుకుంటున్నారు.

వెనక్కి తిరుగుముఖం పట్టడంతో పల్చబడ్తున్నారు జనం.

ఆఖరివెయ్యీ ఓ పుంజు మీద కాసేడు ఆదిబాబు.

అంతే. ఆదిబాబు అదృష్టం మొదలైంది.

పొద్దున్నుంచి పందాలు కాస్తూనే ఉన్నాడు. రాత్రిదాకా డబ్బులు వస్తూనే వున్నాయి గానీ పోవటం లేదు.

ఒకటే వర్షం, డబ్బుల వర్షం... కురుస్తూనే ఉంది. కాసిన ప్రతీ పందెం నెగ్గడమే. సాయంత్రమయ్యేసరికి ఈమూడు రోజుల్నుంచీ పోగొట్టుకున్న దానికంటే ముప్ఫైరెట్లు వచ్చింది డబ్బు. కట్టల కట్టల డబ్బు. ఆగండ్రా రంకు మొగుళ్ళారా అంటే వినడం లేదు అవతలివాళ్ళు. పందాల్లో నెగ్గిన కట్టలు మీదికి విసిరేస్తున్నారు. ఆ డబ్బంతా మూట గట్టాలంటే రెండుమూడు గోనె సంచులు కావాలి.

ఏంటి చెయ్యడం? ఈ కట్టల్ని ఎలా మూటలు గట్టడం?

కట్టుకున్న గ్లాస్కోసంచి ఊడదీసి మూట గట్టి దానిమీద కూర్చున్నాడు.

సారా సూరమ్మ మేనల్లుడు క్రిష్ణ ఒక మూలనించీ, భోగమోళ్ళ చినబంగారం ఇంకో మూలనించీ, దొంగరావుడు ఒకచోట నించీ చూస్తున్నారు. ఇద్దరు పోలీసోళ్ళు చూస్తున్నారు. వాళ్ళ చూపులు శవాన్ని పాతిపెట్టిన కాష్టాలదిబ్బచుట్టూ నక్కల చూపుల్లా ఉన్నాయి.

తెల్లవారేలోపు ఈ ముగ్గుర్లో ఎవరో ఒకళ్ళు మాత్రం ఏమాత్రం అవకాశం దొరికినా తనని కబళించకమానరు. అటుచూస్తే తోడల్లుడు కమ్మెటసూర్నాణ ఉన్న పసలపూడి ఈ పెదరెడ్డిగారి గరువుకీ చాలా దూరంలో ఉంది. ఆ మనిషికి కబురు చెయ్యమని ఆ పని చేసి పెడితే వెయ్యిరూపాయిలు ఇస్తానని బతిమాలేడో రెడ్ల కుర్రోడ్ని.

జనం తీర్థం సంబరంలో మునిగివున్నారు. జనంతో కిటకిట లాడుతున్నంతసేపు ఫర్వాలేదు బయటికి వెళ్ళారో చంపి ఆడబ్బు లాక్కుపోతారు.

అంతా చెట్ల వెనకా పుట్ల వెనకా నక్కి ఆదిబాబునే చూస్తున్నారు. వాళ్ళు తనకోసం పొంచి ఉన్నారని తెల్సుకున్న ఆదిబాబు గడగడా ఒణికిపోతున్నాడు. అంత చలిలోనూ తలలోంచి కారిపోతున్నాయి చెమట్లు.

అంత రాత్రి పూట కబురందుకున్న తోడల్లుడు కమ్మెటసూర్నాణకి మతిపోయింది. ఇంత డబ్బుతో ఆదిబాబుని ఊళ్ళోకి తీసుకురావడం ఎలాగ? తీసుకువచ్చినా తెల్లవారి రామచంద్రపురం వెళ్ళి బేంకు తీసేదాకా, ఇంత డబ్బు నా ఇంట్లో దాయడం ఎలాగ?

అతనికి ఒక్కటే ఉపాయం తోసింది. తీర్థంలో సెక్యూరిటీ కోసం డ్యూటీలో వున్న ఎస్సైని కలిసి సాయం చెయ్యమన్నాడు.

ఎస్సైకూడా అమ్మో! అంత డబ్బుతో అతడ్ని ఇవతల వుంచితే ప్రమాదం దానికి ఒక్కటే మార్గం వుంది అంటూ ఒక కండీషన్ పెట్టాడు. ఆ కండీషన్ ప్రకారం, దొంగల్నీ తీసుకెళ్ళే వేన్‌లో డ్రాయర్‌తో వున్న ఆదిబాబుని నోట్లమూటతో సహా ఆ దొంగల వేన్‌లో ఎక్కించి, రామచంద్రపురం తీసుకెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో ఆ రాత్రంతా లాకప్‌లో పెట్టి పోలీసుల్నీ కాపలా పెట్టారు. మర్నాడు అదే వేన్‌లో బేంక్‌కి తీసుకెళ్ళి డబ్బిచ్చి క్రాస్డ్‌డ్రాఫ్ట్ తీసుకుని హమ్మయ్యా అని ఊపిరి పీల్చారు సూర్నాణ, ఆ ఎస్సై.

''ఇప్పుడు చెప్పండి- డబ్బు వచ్చి ఏం చేసింది? భయం, గుండె దడా, ప్రాణభీతి తీసుకువచ్చింది. గుడ్డలూడదీసి డ్రాయర్‌తో నిలబెట్టింది. దొంగలవేన్‌లో ఎక్కించింది. రాత్రంతా జైల్లో పెట్టింది'' అంటూ పకపకా నవ్వేరు స్వరాజ్యరెడ్డిగారు.

ఆయనగారు చెప్పింది కథో- నిజమో! డబ్బు డబ్బు అంటూ వెర్రి యావలో పడేవాళ్ళని మాత్రం ఆలోచనలో పడేసింది.

అవునా? కాదా?

* * *